**013/DM/18**

| Register Number | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|

**DEPARTMENTAL EXAMINATIONS**

**TRANSLATION TEST — SECOND PAPER — TRANSLATION OF NEWS PAPER REPORT IN TELUGU TO ENGLISH**

(Without Books)

Maximum Time : 2.30 hours — Maximum Marks : 100

**Answer ALL questions.** **(5 × 20 = 100)**

**Translate into English.**

1. పట్టణ సేవలు :

2011 లెక్కల ప్రకారం తాగు నీటి సరఫరాకు సంబంధించి భారతదేశంలో 70.6 శాతం మంది పట్టణ ప్రజల వ్యక్తిగత కనెక్షన్లు కలిగి ఉండగా, చైనాలో 91 శాతం, దక్షిణాఫ్రికాలో 86 శాతం, బ్రెజిల్‌లో 80 శాతం మంది ప్రజలు వ్యక్తిగత కనెక్షన్లు కలిగి ఉన్నారు. నీటి సరఫరా కాల వ్యవధి భారత నగరాల్లో 1–6 గంటలు కాగా; చైనా, బ్రెజిల్‌లో 24 గంటలుగా వియత్నాంలో 22 గంటలుగా ఉంది.

భారతదేశంలోని 4,861 నగరాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య సౌకర్యం పాక్షికంగా ఉంది. 2011 లెక్కల ప్రకారం భారత్‌లోని 13 శాతం పట్టణ కుటుంబాలకు ఎలాంటి మరుగుదొడ్డి సౌకర్యం లేదు.

భారతదేశ ప్రజా రవాణాలో పట్టణ రవాణా వాటా 27 శాతం. 1951 లో మొత్తం ప్రజారవాణా వాహనాల్లో పట్టణ ప్రజా రవాణా వాహనాల వాటా 11 శాతం కాగా, 2001 లో 1.1 శాతం తగ్గింది. 2009 లో 0.5 మిలియన్ జనాభా కంటే తక్కువ కలిగిన 85 నగరాల్లోని 20 నగరాల్లో మాత్రమే బస్ సర్వీస్ ఉంది.

గృహ కొరత ప్రాజెక్టుల అంచనాపై ఏర్పాటు చేసిన సాంకేతిక కమిటీ అభిప్రాయంలో (2012 నాటికి) పట్టణ ప్రాంతాల్లో నివాస యూనిట్ల కొరత 18.78 మిలియన్లుగా ఉంది. అంచనా వేసిన మురికివాడల్లో నివసించే జానాభా 2012 లో 94.98 మిలియన్లు. జె.ఎన్.ఎన్.యూ.ఆర్.ఎం. క్రింద ఏడేళ్ల కాలంలో 1.6 మిలియన్ నివాస యూనిట్లను మాత్రమే మంజూరు చేశారు.

**[Turn over**

2. వ్యవసాయరంగం :

స్వాతంత్ర్యం వచ్చే నాటికి దేశ ఆదాయంలో 55 శాతం వ్యవసాయ రంగం నుంచే వచ్చేది. దీంతో పాటు 75 శాతం ప్రజలకు వ్యవసాయ రంగమే జీవనాధారం. ఆహార ధాన్యాల ఉత్పత్తి సామర్థ్యం కేవలం 50 మిలియన్ టన్నులు. దీంతో దేశ తీవ్ర ఆహార కొరతను ఎదుర్కొనేది. దీన్ని నివారించేందుకు ప్రజలకు కావాల్సిన ఆహార ధాన్యాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకునేవారు.

అయితే స్వాతంత్ర్యానంతరం వ్యవసాయరంగంలో సైన్స్ అండ్ టెక్నాలజీని ఉపయోగించడంలో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి.

1960 ల్లో ప్రముఖ శాస్త్రవేత్త డా.ఎం.ఎస్. స్వామినాథన్ ఆధ్వర్యంలో హరిత విప్లవాన్ని ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా అధునాతన వ్యవసాయ పరికరాలు, రసాయనిక పురుగు మందులు వాడకాన్ని ప్రారంభించారు. దాంతో వ్యవసాయ రంగం కూడా లాభసాటిగా మారింది.

డ్యామ్‌లు, రిజర్వాయర్లు, కాలువల నిర్మాణంలో నీటి పారుదల సౌకర్యాలు మెరగయ్యాయి. ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐ.ఏ.ఆర్.ఐ), సి.ఎస్.ఐ.ఆర్, ఇక్రిశాట్ వంటి శాస్త్రీయ పరిశోధనా సంస్థల ఏర్పాటు వ్యవసాయ రంగ అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడ్డాయి?

ఇలాంటి చర్యల ఫలితంగా 2016 నాటికి దేశ ఆహార ధాన్యాల ఉత్పత్తి సామర్థ్యం 250 మిలియన్ టన్నులకు చేరింది. పాలు, జీడిపప్పు, పండ్లు, అరటి, మామిడి, ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉండగా తేయాకు, గోధుములు, వరి, చెరకు, చేపలు, పత్తి, పొగాకు ఉత్పత్తిలో రెండో స్థానంలో ఉంది.

ప్రస్తుతం భారత్ ఆహారధాన్యాలను దిగుమతి చేసుకొనే స్థాయి నుంచి ఎగుమతి చేసే స్థాయికి చేరింది. హరిత విప్లవం, శ్వేత విప్లవం, పసుపు విప్లవం వంటి వాటి ద్వారా శాస్త్రీయ మార్గాల్లో దిగుబడిని పెంచారు. సామాన్య రైతుకు కూడా శాస్త్రీయ పద్ధతులపై అవగాహన ఏర్పడింది.

3. జీశాట్–18 :

అత్యాధునిక భారీ కమ్యూనికేషన్ ఉపగ్రహం జీశాట్–18 ను భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) అక్టోబర్ 6న విజయవంతంగా ప్రయోగించింది.

ఫ్రెంచ్ గయానాలోని కౌరూ ద్వీపం నుంచి ఏరియేన్–5 వీఏ–231 రాకెట్ సాయంతో నిర్దేశిత జియో ట్రాన్స్‌ఫర్ కక్షలోకి ప్రవేశపెట్టింది. వాస్తవానికి అక్టోబర్ 5 నే ఈ ప్రయోగాన్ని నిర్వహించాల్సి ఉన్నా, ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల వాయిదా వేశారు.

ప్రస్తుతం ఇన్‌శాట్ / జీశాట్ వ్యవస్థల్లో సేవలందిస్తున్న 14 కార్యాచరణ టెలీ కమ్యూనికేషన్ ఉపగ్రహాల సామర్థ్యాన్ని మరింత పెంచే లక్ష్యంతో ఇస్రో ఈ ఉపగ్రహాన్ని ప్రయోగించింది. దీని బరువు 3,404 కిలోలు.

ఇంత భారీ కమ్యూనికేషన్ ఉపగ్రహాలను మోసుకెళ్ల గల సామర్థ్యం ఇస్రో వద్ద ప్రస్తుతం ఉన్న పి.ఎస్.ఎల్.వీ (పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్) జి.ఎస్.ఎల్.వీ. (జియో సింక్రోనస్ శాటిలైట్ లాంచ్ వెహికల్) వల్ల సాధ్యం కాదు. అందువల్ల యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన ఏరియేనే రాకెట్‌తో ప్రయోగించారు.

ఈ ఉపగ్రహంలో 48 ట్రాన్స్‌పాండర్లు ఉన్నాయి. వీటిలో 24 సీ బ్యాండ్, 12 ఎక్స్‌టెండెడ్ సీ బ్యాండ్, 12 క్యూబ్యాండ్ ట్రాన్స్‌పాండర్లు, వీటికి అదనంగా 2 క్యూబ్యాండ్ బీకన్లు కూడా ఉన్నాయి. నేల మీద యాంటినాలను ఉపగ్రహం వైపుకు ఖచ్చితంగా అనుసంధానించడంలో క్యూబ్యాండ్ బీకన్లు ఉపయోగపడతాయి.

4. భావప్రకటన స్వేచ్ఛ :

సమాచార సాంకేతిక విప్లవం ప్రపంచాన్ని కుగ్రామంగా మార్చేసింది. నేల పలుచెరుగులా ఎక్కడ, ఎప్పుడు ఏ సంఘటన జరిగినా నిమిషాల్లో దృశ్య సాక్షాత్కారమవుతుందంటే కారణం సమాచార సాంకేతిక పరిజ్ఞానమే.

ఇక ప్రసార, సామాజిక మాధ్యమాలైతే మనిషిని మరింత చేరువ చేశాయి. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో జరిగే పలు సంఘటనలపై తమ అభిప్రాయాల్ని పంచుకోవడానికి ఈ మధ్యమం ఎంతగానో దోహదం చేస్తున్నాయి. తమ భావాల్ని స్వేచ్ఛగా ఇతరులతో పంచుకొనే చక్కటి వేదికలయ్యాయి.

ఇటీవల పాలనాపరమైన అంశాలు, రాజకీయ నాయకులపై పలు వ్యాఖ్యానాలు సామాజిక మాధ్యమాల్లో కనిపిస్తున్నాయి, వినిపిస్తున్నాయి. ఇది పాలక పెద్దలకు కంటగింపుగా మారింది. కొత్త చట్టం తీసుకువచ్చి భావ ప్రకటనకు సంకెళ్లు వేశారు. దీనిపై దేశ వ్యాప్తంగా నిరసన వెల్లువెత్తిన నేపథ్యంలో అత్యున్నత న్యాయస్థానం స్పందించింది. భావ ప్రకటనా స్వేచ్ఛాకు విఘాతం కల్గించే సెక్షన్ 66(ఎ) రాజ్యాంగ విరుద్ధమంటూ సముచిత తీర్పునివ్వడంపై సర్వత్రా హర్షం వెల్లివిరిసింది.

జీవించే హక్కు భావ ప్రకటన మానవులకు జన్మత : సిద్ధిస్తాయి. భావ వ్యక్తీకరణ మానవులకు మాత్రమే ప్రకృతి ప్రసాదించిన వరంగా చెప్పవచ్చు. వీటిని భారత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులుగా గుర్తించడమే కాకుండా వాటి రక్షణకు కూడా మేధావులు పెద్ద పీట వేశారు.

5. అందరికి అందుబాటులో మేలిమి విద్య :

ఏ దేశ ఆర్థికాభివృద్ధి అయినా అక్కడి మానవ వనరుల నాణ్యతపై ఆధారపడి ఉంటుంది. మానవ వనరుల నాణ్యత, శ్రామిక ఉత్పాదకతలకు విద్య, వైద్య స్థాయిలే కీలకం. భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశం. 10–24 వయోవర్గంలో 35.6 కోట్ల మంది ఉన్నారు. యువత, శక్తి సామర్థ్యాలను సక్రమంగా వినియోగించుకుంటే భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారే అవకాశం ఉంది.

యువ జనాభాను ఆర్థిక కార్యకలాపాల్లో నిమగ్నం చేయాలన్నా, వారి ఉత్పాదకత శక్తిని పెంచాలన్నా, విద్యా, వైద్య సదుపాయాలను మరింతగా అందుబాటులోకి తీసుకురావాలి. ముఖ్యంగా ఉత్పాదకత శక్తిని పెంపొందించడంలో విద్యాస్థాయిదే కీలకపాత్ర, విద్యాస్థాయిని అంచనా వేయడానికి స్థూల నమోదు నిష్పత్తి (జీ.ఈ.ఆర్.) సూచిక ప్రధానంగా ఉపయోగపడుతుంది.

పాఠశాల లేదా కళాశాలకు వెళ్లడానికి అర్హులైన వయసు కలిగిన మొత్తం పిల్లల యువకుల్లో ఎంత మంది పాఠశాల లేదా కళాశాలలో నమోదయ్యిందో ఈ నిష్పత్తి తెలియజేస్తుంది. అర్హులైన వారికి అందుబాటులో ఉన్న విద్యావకాశాలు, విద్యాసంస్థలు జ్ఞాన సముపార్జనకు గల అవకాశాలు దీని ద్వారా తెలుస్తాయి దేశంలో ఈ నిష్పత్తి ప్రాథమిక విద్యలో 92 శాతం మాధ్యమిక స్థాయిలో 52 శాతం, ఉన్నత విద్యలో 23.6 శాతంగా ఉంది. దేశ జనాభాలో 44 శాతం 6–23 వయో పరిమితి వారు విద్యాభ్యాసం చేస్తున్నాయి. కానీ విద్య కోసం వెచ్చిస్తున్న మొత్తం స్థూల దేశీయోత్పత్తి (జీడిపి)లో 3.3 శాతమే.

పేదరికం, నిరుద్యోగం, ఉపాధికి హామి ఇవ్వని విద్యా విధానం, మేలిమి విద్యా సంస్థలు, సదుపాయాలు, ఆసక్తి గల కోర్సులు అందుబాటులో లేకపోవడం లోపభూయిష్టమైన బోధన పద్ధతులు, మూల్యాంకన విధానం, అనుత్తీర్ణత తదితర అంశాలు విద్యార్థులు మధ్యలో బడిమాని వేయడానికి కారణాలు.

జీఈఆర్‌ను 2020 నాటికి 30 శాతానికి పెంచాలన్నది పన్నెండో ప్రణాళికలో నిర్దేశించిన లక్ష్యం.